RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 300 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 3 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర..!!

## మోడి, షాలు ఢిల్లీ సుల్తానులా వ్యవహరిస్తున్నారు

### ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్న బీజేపీ నే ప్రజలు రద్దు చేయాలి

### ఆసిఫాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**ఆసిఫాబాద్ మే 2(ప్రభాత సమాచారం)** దిల్లీ సుల్తాన్‌లు తెలంగాణపై దాడి చేయాలనుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ఆటలు, తెలంగాణలో సాగవని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే అజెండాతోనే 2021లో జనాభాను లెక్కించలేదని సీఎం దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. లోక్?సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్?లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని ఆయన దుయ్యబట్టారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై మండిపడ్డారు. రైతుల పోడు భూముల సమస్యలపై, కేసీఆర్ దృష్టి పెట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఇక్కడి ప్రాంతంలో విద్యాభివృద్ధికి బీజేపీ ఎటువంటి కృషి చేయలేదన్నారు. కేంద్ర మంత్రివర్గంలో గోండులకు బీజేపీ స్థానం ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గోండులు, లంబాడ హక్కులను కాపాడలేదని మండిపడ్డారు. ఇంతవరకు ఆదిలాబాద్ లోక్‌సభ టికెట్‌ను మహిళలకు ఏ పార్టీ ఇవ్వలేదని, తొలిసారిగా ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను మహిళలకు కేటాయించినట్లు సీఎం రేవంత్ పేర్కొన్నారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని ఆరెస్సెస్ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి దేశంలో జనాభా లెక్కలు లెక్కిస్తున్నామని, 2021లో జనాభా లెక్కించాల్సి ఉన్నా బీజేపీ లెక్కించలేదని పేర్కొన్నారు. 2021లో జనాభాను లెక్కించకుండా అమిత్‌షా కుట్ర చేశారని, రిజర్వేషన్లను రద్దు చేయాలనే అజెండాతో 2021లో జనాభాను లెక్కించలేదని సీఎం దుయ్యబట్టారు. రిజర్వేషన్లు రద్దు చేయాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ కావాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేయాలంటే 50 శాతం రాష్ట్రాలు ఒప్పుకోవాలని, రిజర్వేషన్ల రద్దు కోసమే 8 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాలను పడగొట్టారని మండిపడ్డారు. బీజేపీకి వేసే ప్రతి ఓటు, రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుందని, రాజ్యాంగాన్ని సమూలంగా మార్పు చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగ మార్పుపై మాట్లాడుతున్నా అని తనపై అమిత్‌షా కేసు పెట్టించారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ తనపై 200 కేసులు పెట్టినా భయపడలేదని, కేసులుపెట్టి మెదీ నన్ను బెదిరించగలరా? ఆయన ప్రశ్నించారు. దిల్లీ సుల్తాన్‌లు తెలంగాణపై దాడి చేయాలనుకుంటున్నారని, బీజేపీ ఆటలు సాగవని స్పష్టం చేశారు. బీజేపీ చేసే కుట్రలను అడ్డుకుంటానన్నారు. రాష్ట్రానికి బయ్యారం ఉక్కు కర్మాగారం అడిగితే, మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని, తెలంగాణకు కేంద్రం గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.










సీఎం రేవంత్‌పై నిజామాబాద్ భాజపా ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై 14 రేవంత్ రెడ్డికి డెడ్‌లైన్ అని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఐలాపూర్, మల్లాపూర్‌లలో ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్ కొన్ని అయినా హామీలు అమలు చేశారని, రేవంత్ ఆరు గ్యారంటీలను పట్టించుకోవట్లేదని మండిపడ్డారు.



## నేను చెప్పింది తప్పని నిరూపిస్తే... చంచల్‌గూడ జైలుకు వెళ్లేందుకు రెడీ..

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న మంచినీరు, విద్యుత్ కొరత విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫేక్ సర్క్యులర్ ట్వీట్ చేసి ఈ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ట్వీట్ చేసిన సర్క్యులర్ ఫేక్ కాదని నిరూపిస్తే చంచల్‌గూడ జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మార్చి 18వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ నోటీసులు జారీ చేశారు. నెల రోజుల పాటు హాస్టల్స్, మెస్‌లు మూసివేస్తున్నాం. తీవ్రమైన నీటి కొరత, విద్యుత్ సమస్య ఉందని, విద్యార్థులు హాస్టల్స్ ఖాళీ చేసి అధికారులకు సహకరించాలని చీఫ్ వార్డెన్ నోటీసులు ఇచ్చారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఓయూ విద్యార్థులు ఉద్యమించారు. తమ గళాన్ని బలంగా వినిపించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాం.. మేం ఎక్కడికి పోం అని చెప్పారు. ధర్నా కూడా చేశారు. ధర్నాకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని కేటీఆర్ తెలిపారు.




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెన్సేషన్ కోసం మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారని భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిపై 60 వేల ఓట్ల తేడాతో గెలిచిన తనను.. తృటిలో తప్పించుకుని మహేశ్వరంలో గెలిచారని రేవంత్ అనడం సరికాదన్నారు. తనపై, భాజపా మహిళా నాయకురాలు డీకే అరుణపై రేవంత్ వ్యాఖ్యల పట్ల మహిళా సమాజం ఆలోచించాలని సబితా ఇంద్రారెడ్డి సూచించారు.



## నేటి నుంచి యథావిధిగా గులాబీ దళపతి కేసీఆర్ రోడ్ షో

బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు రోడ్‌షో శుక్రవారం నుంచి యథావిధిగా కొనసాగనున్నది. కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం 48 గంటల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి 8 గంటల నుంచి 48 గంటలు పాటు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధం అమలులో ఉన్న సమయంలో బహిరంగ సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ఇంటర్వ్యూలు, రోడ్‌షోలు, మీడియాలో బహిరంగంగా మాట్లాడొద్దని సూచించింది. అదే సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు, ప్రింట్ మీడియాల ద్వారా ఎక్కడా ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని చెప్పింది. మహబూబాబాద్ పట్టణంలో ప్రచారంలో ఉండగా ఎన్నికల సంఘం అధికారులు కేసీఆర్ బస్‌యాత్ర వద్దకు చేరుకొని ఉత్తర్వులు అందజేశారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు బుధవారం రాత్రి 8 గంటలకు ముందుగానే కేసీఆర్ ముగించుకొని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోని నివాసానికి వెళ్లిపోయారు. షెడ్యూల్ ప్రకారం.. మహబూబాబాద్‌లో రోడ్‌షో నిర్వహించి.. వరంగల్‌లో బస చేయాల్సి ఉంది. వరంగల్ నుంచి తొమ్మిదో రోజు గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో రోడ్ షో నిర్వహించి.. వీణవంకలో బస చేయాల్సింది. ఎన్నికల సంఘం విధించిన గడువు ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి కేసీఆర్ యథావిధిగా రోడ్‌షో నిర్వహించనున్నారు. శుక్రవారం 8 గంటల తర్వాత పెద్దపల్లి జిల్లా రామగుండంలో బస్‌యాత్ర కొనసాగించి.. అదే రోజు రాత్రి రామగుండంలోనే బస చేయనున్నారు. శనివారం జగిత్యాల జిల్లాలో రోడ్ నిర్వహించి.. అక్కడే బస చేస్తారు.

# దంచికొడుతున్న ఎండలు..!

## వర్షాలపై కీలక అప్‌డేట్ ఇచ్చిన వాతావరణశాఖ..!

హైదరాబాద్ : తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో జనం వణికిపోతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. బుధవారం అత్యధికంగా నల్గొండ జిల్లా గూడపూర్‌లో 46.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో 47 డిగ్రీల మార్క్‌ను దాటే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. గురువారం నుంచి శనివారం వరకు దీర్ఘకాల వడగాలులు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు కొనసాగుతాయని హెచ్చరించింది. శుక్రవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడ వడగాలులు వీస్తాయని చెప్పింది. ఈ నెల 6న రాష్ట్రం నుంచి పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.



## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# ఏపీలో కొత్త రాజకీయం

## ప్రత్యర్థి మీడియా చానళ్ళ బ్యాన్!

తమ గురించి ఎక్కువగా చెప్పని లేక తమ తప్పులను ఎత్తి చూపే మీడియా చానళ్ళ కు ప్రత్యర్థులుగా ఏపీలోని ప్రధాన రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. దాంతో ఆయా చానళ్ళ మీద విరుచుకుపడుతున్నాయి. రాజకీయం పీక్స్ కి చేరితే ఇంతే మరి అన్నట్లుగా ఉంది. ఏపీలో టీడీపీకి అనుకూల చానళ్ళు అంటే ఈటీవీ ఏబీఎన్ టీవీ 5, మహా టీవీ అని చెబుతారు. ఇక వైసీపీకి సొంతంగా సాక్షి ఉంది. అలాగే ఎన్టీవీ టీవీ 9 కూడా ఎంతో కొంత మద్దతుగా ఉంటున్నాయని ప్రచారంలో ఉంది. ఇదే ఇపుడు ఆ చానళ్ళ మీద బ్యాన్ కి కారణం అవుతోందిట. ఎటూ సాక్షి చానల్ డిబేట్ కి టీడీపీ ప్రతినిధులు రారు. ఇపుడు ఎన్టీవీ టీవీ 9 చానళ్ల మీడియా డిబేట్ కి కూడా వెళ్ళవద్దు అని ఆదేశాలు టీడీపీ అధినాయకత్వం ఇచ్చింది అని ప్రచారం సాగుతోంది. నిజంగా ఇది బాధాకరమే అంటున్నారు. రాజకీయం కాస్తా ఎక్కడికో వెళ్ళి ఆఖరుకు మీడియా చానళ్ల మధ్య బ్యాన్ కి దారి తీయడం అంటే ఆలోచించాలని అంటున్నారు. మరో వైపు చూస్తే ఎన్టీవీ టీవీ 9లకు మంచి ఆదరణ ఉంది. న్యూట్రల్ పీపుల్ కూడా వీటిని వీక్షిస్తారు. ఇపుడు టీడీపీ అధినాయకత్వం ఈ చానళ్ళను బ్యాన్ అంటూ తీసుకున్న నిర్ణయం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ అని అంటున్నారు. అదే టైంలో వైసీపీ అయితే టీడీపీ అనుకూల మీడియా చానళ్ళకు ఎపుడో బ్యాన్ చేసేసింది. ఇలా వార్ కాస్తా జగన్ చంద్రబాబుల నుంచి మీడియా చానళ్ళ దాకా పోతోంది. ఇది ఎంత వరకూ వెళ్తుంది అన్నది చూడాల్సి ఉంది. నువ్వా నేనా అంటూ సాగే రాజకీయ పోరులో మిగిలిన వ్యవస్థలు కూడా అవస్థ పడుతున్నాయా అంటే అవును అనే జవాబు వస్తోంది. అదే టైం లో ఇది మంచి విధానం కాదు అని కూడా అంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మీడియా ప్రభావం రాజకీయంగా పడడం, రాజకీయ ప్రభావం మీడియా మీద పడి వాటికి పార్టీల రంగులు అద్దడం అన్నది ఒక్క ఏపీలోనే చూస్తున్నామని అంటున్నారు. రెండు పార్టీలు రెండు కుటుంబాలు ఇద్దరు వ్యక్తులు ఇలా దశాబ్దాలుగా ఏపీలో రాజకీయం సాగుతోంది అని అంటునారు. అది అలా కంటిన్యూ అవుతోందని తరం మరి కొత్త తరానికి బదిలీ అవుతోందని ఫలితంగా మరింతగా పదును తేరి ప్రజాస్వామ్య పోకడలనే అపహాస్యం చేసే తీరుగా సాగుతోందని అంటున్నారు. అయితే ఇపుడు మరో విషయం కూడా చెప్పుకోవాలి. బహుశా అదే జనాలకు మేలు చేస్తూ చేరువ అవుతోంది అని కూడా భావించాలి. యూట్యూబ్ చానల్స్ సోషల్ మీడియ వెబ్ మీడియాను ఇపుడు జనాలు ఎక్కువగా నమ్ముతున్నారు. వాటికి విశ్వసనీత పెరిగింది.

వాటి మీదనే అందరి దృష్టి పడుతోంది. అచ్చమైన నిజాలు చెప్పేవిగా కూడా సోషల్ మీడియా వేదికగా సాగే చానల్స్ కి ఇతర మీడియా సంస్థలకు జనాలు అట్రాక్ట్ అవుతున్నారు అని అంటున్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**సిర్పూర్( యు) మే 2(ప్రభాత సమాచారం)**
ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం సిర్పూర్(యు) మండలంలోని రాఘపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పిట్టగూడా గ్రామంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కాంగ్రెస్ హయాంలోనే అటవీ హక్కు చట్టాన్ని తెచ్చామని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే అది కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు పదేండ్లు అధికారంలో ఉండి ఈ ప్రాంత ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. బిజెపి పార్టీ రాజ్యాంగానికి తూట్లు పొడిచి అన్ని హక్కులను కాల రాస్తుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రాజ్యాంగం కాపాడబడాలంటే రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**ఉట్నూర్ మే 2(ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. కేంద్రంలో మళ్ళీ బిజెపి అధికారంలో వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తుందన్నారు. సబ్బండవర్గాల సంక్షేమాన్ని కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ఈ దేశానికి ప్రధానిని చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఎంతైనా ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు తర్వాత... సిద్దిపేటకు విముక్తి కల్పిస్తా...!

## మెదక్‌లో నీలం మధును గెలిపిస్తే.. నా సొంత నియోజకవర్గంగా బాధ్యత వహిస్తా - రేవంత్ రెడ్డి



సిద్దిపేట: ఆరునూరైనా మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని సీఎం రేవంత్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మెదక్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ గెలవబోతోందంటే దానికి కార్యకర్తలే కారణమన్నారు. ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సిద్దిపేటను 45 ఏళ్ల నుంచి పాపాల భైరవుల్లా మామ, అల్లుడు (కేసీఆర్, హరీశ్‌రావు) పట్టిపీడిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి నుంచి ఈ ప్రాంతానికి విముక్తి కల్పించడానికే వచ్చానని చెప్పారు. మెదక్ లోక్‌సభ స్థానం నుంచి అప్పట్లో ప్రాతినిధ్యం వహించిన ఇందిరాగాంధీ ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. నెహ్రూ, ఇందిర వల్లే వేలాది పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. సిద్దిపేట గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరకపోతే శాశ్వతంగా బానిసత్వం వస్తుందని హెచ్చరించారు. వెంకట్రామిరెడ్డి వద్ద డబ్బులు ఎక్కువ ఉన్నాయనే మామ, అల్లుడు ఆయనకు టికెట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. కలెక్టర్‌గా పని చేసిన సమయంలో వెంకట్రామిరెడ్డి వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలను కొల్లగొట్టారని, నిజాం దగ్గర ఖాసీం రిజ్వీ ఎలాగో.. కేసీఆర్‌కు వెంకట్రామిరెడ్డి అలా అని వ్యాఖ్యానించారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా కరీంనగర్‌కు చెందిన వ్యక్తిని నిలబెట్టడం వెనక ఆంతర్యమేంటి? ఇక్కడ భారాసకు అభ్యర్థులు లేరా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో సభ పెడితే ఎవరూ రారేమోనని కొందరు నేతలు అనుమానం వ్యక్తం చేశారని, ఇక్కడి జన సంద్రాన్ని చూస్తుంటే.. నీలం మధుకు లక్ష మెజార్టీ పక్కా అనిపిస్తోందని రేవంత్ అన్నారు.

మొదటిసారిగా గడీలను బద్ధలు కొట్టే అవకాశం వచ్చిందనీ, సిద్దిపేట ప్రజల పౌరుషాన్ని చూశాక సంపూర్ణమైన నమ్మకం కలిగిందని వ్యాఖ్యానించారు. పదేళ్లలో ప్రధాని మోదీ తెలంగాణకు 'గాడిద గుడ్డు' ఇచ్చారని రేవంత్ ఎద్దేవా చేశారు. భారాస, భాజపా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. ముదిరాజ్ సామాజిక వర్గం వారికి మంత్రిపదవి ఇస్తానని హామీ ఇచ్చారు. పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తానని పునరుద్ఘాటించారు. "సిద్దిపేట శనీశ్వరరావును పాతాళానికి తొక్కే బాధ్యత నాది. ఆగస్టు 15న సిద్దిపేటకు స్వాతంత్ర్యం రాబోతోంది. హరీశ్‌రావు ఆటలు.. పంద్రాగస్టు వరకే. రైతు రుణమాఫీ చేస్తా.. హరీశ్‌రావు రాజీనామా పత్రం సిద్ధంగా ఉంచుకో. హరీశ్ రాజీనామా చేశాక.. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తా. రూ.2లక్షల రుణమాఫీ చెయ్యగానే సిద్దిపేటలో లక్ష మందితో భారీ సమావేశం పెడతా, మెదక్ పార్లమెంట్ నుంచి బలహీనవర్గాల బిడ్డ నీలం మధు ముదిరాజ్ ను పార్టీ అధిష్టానం బరిలోకి దించింది.. పార్టీ కార్యకర్తల త్యాగాల వల్లనే మెదక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ జెండా ఎగరబోతుంది... 45 ఏళ్ల నుంచి సిద్దిపేట నియోజకవర్గంలో మామ ,అల్లుడు శని లా పట్టి పీడిస్తున్నరు.. సిద్దిపేట నుంచి మామ పోతా పోతా పీనుగులు తినే అల్లుడిని పెట్టి పోయాడు.. సిద్దిపేట ప్రజలను పట్టి పీడిస్తున్న బ్రహ్మ రాక్షసుల నుంచి విముక్తి చేయడానికే ఈ గడ్డ మీదికి వచ్చిన.. 1980లో ఇందిరాగాంధీ ని గెలిపించి ప్రధానిని చేసిన చరిత్ర మెదక్ ది.. ఇందిరమ్మ మెదక్ కు అనేక పరిశ్రమలు తీసుకువచ్చింది... మంచికి మారు పేరు మెదక్ ప్రజలు.. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఇక్కడి వారు ఆశ్రయం ఇచ్చారు.. ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ నుంచి బలహీన వర్గాల బిడ్డకు కాంగ్రెస్ అవకాశం ఇచ్చింది. రైతుల భూములు గుంజుకొని మల్లన్న సాగర్ కట్టిన వారు కావాలా లేక బడుగు బలహీన వర్గాల బిడ్డ కావాలా.. రైతులపైన అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించిన చరిత్ర వెంకట్రామిరెడ్డి ది.. దొర దౌర్జన్యం ఇంకెన్ని రోజులు ఇక్కడ నడస్తది.. మెదక్ ప్రజలు ఆలోచించండి. సిద్దిపేట గడ్డ పైన మూడు రంగుల జెండా ఎగరకపోతే శాశ్వతంగా బానిసలుగా బతకాల్సి వస్తుంది.. దొరల గడిలను బద్దలు కొట్టాలంటే నీలం మధు ముదిరాజ్ గెలవాల్సిందే." అని రేవంత్ తెలిపారు.

# కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ



**సంగారెడ్డి మే 2(ప్రభాత సమాచారం)**
మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు ఆర్. సత్యనారాయణ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్దిపేట లో జరిగిన ఎన్నికల సభలో పాల్గొనడానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణ తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచుకొన్నారు

# అభ్యర్థులు వీరే.. ఇక ప్రచార హోరే!

సంగారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. నామినేషన్ల ఉప సంహరణ గడువు సోమవారం ముగియగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 19 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించగా.. 40 మంది 68 సెట్లు దాఖలు చేశారు. పరిశీలన ప్రక్రియలో 14 మందికి చెందిన 19 సెట్లు తిరస్కరించారు. 26 మంది అభ్యర్థుల నామపత్రాలను ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇందులో ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉప సంహరించుకున్నారు. బరిలో ఉన్న వారిలో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన వారు ముగ్గురు ఉండగా.. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఆరుగురు, మిగతా పది మంది స్వతంత్రులు. అభ్యర్థుల సంఖ్య 15 దాటడంతో ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు చొప్పున ఈవీఎంలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఈవీఎంలో నోటాతో కలిపి 16 గుర్తులు ఉంటాయి. ఓటర్లు రెండు ఈవీఎంలను పరిశీలించి.. అభ్యర్థికి చెందిన మీట నొక్కనున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థుల నేపథ్యం

గాలి అనిల్‌కుమార్: భారాస

2009లో భారాస (తెరాస) పటాన్‌చెరు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. 2014లోటికెట్ ఆశించి భంగపడ్డారు. కాంగ్రెస్‌లో చేరి.. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ టికెట్ రాకపోవడంతో తిరిగి భారాస గూటికి చేరారు. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

బీబీ పాటిల్: భాజపా

స్వగ్రామం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సిర్పూర్. జహీరాబాద్ నుంచి రెండు పర్యాయాలు (2014, 2019లో) భారాస అభ్యర్థిగా పోటీ చేసి ఎంపిగా గెలుపొందారు. ఇటీవల భాజపాలో చేరారు. ప్రస్తుతం భాజపా నుంచి పోట్జీలో ఉన్నారు.

సురేష్ కుమార్ షెట్కార్: కాంగ్రెస్

2004లో ఖేడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మొదటి ఎంపీగా విజయం సాధించారు. 2014లో జహీరాబాద్ ఎంపీగా, 2018లో నారాయణఖేడ్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

మెదక్ పోరులో 44 మంది..

మెదక్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య తేలింది. కీలకమైన సంగ్రామంలో 44 మంది అభ్యర్థులు తలపడనున్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు తలపడుతున్న నియోజకవర్గాల్లో రాష్ట్రంలోనే మెదక్ ద్వితీయ స్థానంలో ఉంది. ఇందులో గుర్తింపు, రిజిస్టర్ పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. 29 మంది స్వతంత్రులు బరిలో నిలిచాయి. అత్యధిక మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో పోలింగ్ రోజున ఓటు వేసేందుకు మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరమరమవుతాయి.

# కారు.. కసరత్తు

నల్గొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నైరాశ్యంలో ఉన్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కల్పించడం, ఉమ్మడి నల్గొండలోని నల్గొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో సత్తా చాటేలా ప్రతిపక్ష భారాస వ్యూహ రచన చేస్తోంది. ఇప్పటి వరకు తమ చేతికి చిక్కని నల్గొండ స్థానంలో పాగా వేయడం, గత ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో కోల్పోయిన భువనగిరి లోనూ విజయం సాధించేలా క్షేత్రస్థాయి కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాపైనే ఎక్కువ దృష్టి సారించడంతో ఈ ఎన్నికల్లో సానుకూల ఫలితాలు ఉంటాయని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఫిబ్రవరి 13న తొలిసారిగా నల్గొండ జిల్లా కేంద్రంలో కృష్ణా జలాల పరిరక్షణ సభ పేరుతో భారాస భారీ బహిరంగ సభ నిర్వహించింది. అనంతరం పొలంబాట పేరుతో గత నెల చివరిలో సూర్యాపేట, నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎండిన పొలాలను కేసీఆర్ సందర్శించి రైతులను పరామర్శించారు. తాజాగా నిర్వహిస్తున్న బస్సుయాత్రను సైతం ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ నుంచే ప్రారంభించారు. రెండు రోజుల పాటూ మూడు ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిని బట్టి ఉమ్మడి జిల్లాపై భారాస ఎంతగా దృష్టిసారించిందో తెలుసుకోవచ్చని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



మరోవైపు అభ్యర్థుల ప్రకటనలో కొంత జాప్యం నెలకొన్నా చివరకు భువనగిరిలో అత్యధిక ఓట్లున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన క్యామ మల్లేష్‌ను, నల్గొండలో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రభావం చూపే సామాజికవర్గానికి చెందిన కంచర్ల కృష్ణారెడ్డిని బరిలో దింపారు. రెండు స్థానాల్లోనూ ముఖ్య నాయకుల సమన్వయం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల ప్రచారం తదితర అంశాలను మంత్రి జగదీశ్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఈ దఫా భారాసకు మద్దతివ్వాలని కోరుతున్నారు. సీఎం కేసీఆర్ ప్రచారం, రోడ్‌షోలు ముగియడంతో రెండు స్థానాల్లోని పలు కీలక ప్రాంతాల్లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో రానున్న పది రోజుల్లో ప్రచారం నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఒకట్రెండు రోజుల్లో ముఖ్య నేతల ప్రచార షెడ్యూల్ రానుందని పార్టీ నాయకులు వెల్లడించారు.

వలసలతో ఇబ్బందులు

పదేళ్ల పాలనలో అన్ని పార్టీల నాయకుల రాకతో కిటకిటలాడిన భారాస...అధికారం కోల్పోగానే ఉమ్మడి జిల్లాలోని సగానికంటే ఎక్కువగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, భాజపాల్లోకి వలస వెళుతున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పార్టీకి కీలకమయిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటూ సహకార సంఘాల ఛైర్మన్‌లు, డైరెక్టర్‌లు పార్టీ మారుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ప్రభావం చూపగల బలం ఉన్న మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డితో పాటూ గుత్తా సోదరుడు, మదర్ డెయిరీ మాజీ ఛైర్మన్ జితేందర్ రెడ్డి తదితరులు భారాస నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లడం పార్టీకి ఇబ్బంది కలిగించే పరిణామమే. అయితే నాయకులు వెళుతున్నారు తప్పితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల బలం అలాగే ఉందని సీనియర్ నేతలు వెల్లడిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా భిన్నమైనవని..ఐదు నెలల్లోనే కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలు గమనిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ ప్రజలు భారాసకు పట్టం కడుతారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో ధీమా వ్యక్తం చేశారు.

# ఇక సమరమే..!



తాండూరు : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలకు బరిలో దిగే అభ్యర్థుల లెక్క తేలింది. ఉపసంహరణల అంకం ముగియడంతో ఇక ప్రచారం హోరెత్తించేందుకు వారంతా వ్యూహాలకు పదునెక్కించే పనిలో పడ్డారు. జిల్లా నుంచి 3 నియోజక వర్గాలు: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మొత్తం 7 నియోజకవర్గాలుండగా జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి శాసన సభ నియోజకవర్గాలు వస్తాయి.(మిగతా వాటిలో శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల ఉన్నాయి). వీటిలో అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, భారాస నుంచి మాజీ ఎమ్మెల్యేలకు తోడు నేతలున్నారు. భాజపాకు ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు లేక పోవడంతో కొంత కాలం నుంచి కింది స్థాయి కేడర్‌ను అప్రమత్తం చేస్తూ వస్తోంది. తరచూ సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసింది. అభ్యర్థులు ఇప్పటికే అడపా దడపా గ్రామాలకు వెళ్లి ఓటర్లను కలిశారు. తాజాగా ముఖ్య నాయకులు, అభ్యర్థులు గ్రామాలకు వెళ్లి తేదీలను ఖరారు చేసుకుంటున్నారు.

మెజారిటీ ఓట్లపై దృష్టి సారించారు

పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు మెజారిటీ ఓట్లపై దృష్టి సారించారు. ఇందుకోసం అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఓ ప్రధాన పార్టీ అల్ప సంఖ్యాకుల ఓట్లన్నీ తమకే పడేలా మంత్రాంగం నెరుపుతోంది. ఇంకో పార్టీ యువ ఓటర్లకు తోడు వారి కుటుంబ సభ్యుల ఓట్లపై గురి పెట్టింది. మరో ప్రధాన పార్టీ జిల్లాలో ఎక్కువగా ఉన్న సామాజిక వర్గం ఓట్లు తమకే వస్తాయనే దీమాతో ఉంది.

ప్రధాన పోటీ ఆ ముగ్గురి మధ్యే..

కాంగ్రెస్ నుంచి రంజిత్‌రెడ్డి, భాజపా నుంచి కొండా విశ్వేశ్వరరెడ్డి, భారాస నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రధాన పార్టీల అభ్యర్థులుగా నిలిచారు. స్వతంత్రులుగా మరి కొందరు పోటీ చేస్తున్నారు.

సీఎం, పీఎంలతో బహిరంగ సభలకు ప్రణాళిక

ఎన్నికల్లో అగ్రనేతలను రప్పించి భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు అభ్యర్థులు ప్రణాళికను రూపొందిస్తున్నారు. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగిలో ఎక్కడ సభలు నిర్వహిస్తారనే విషయం ఇంకా ఖరారు కాలేదు.

భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ రానున్నారని నాయకులు ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయాన్ని కోరుతూ వికారాబాద్ లేదా తాండూరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బహిరంగ సభ ఏర్పాటుచేసే అవకాశం ఉంది.

భారాస అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రలో భాగంగా జిల్లాలో పర్యటించ బోతున్నారు. ఇందుకు సంబంధించి తేదీ, సమయం ఖరారు కావాల్సి ఉంది

నేతలతో ఫోన్లలో మంతనాలు

జిల్లాలో పట్టున్న నేతలతో ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ముఖ్య నాయకులు ఫోన్లలో అంతర్గతంగా సంప్రదింపులు జరుపుతున్నారు. తమ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. అనుబంధ పార్టీల నాయకులతో కూడా మంతనాలు చేపడుతూ మద్దతు కూడగట్టేందుకు యత్నిస్తున్నారు.

# స్వయం ప్రేరణతో పోలింగ్ మెరుగు

కొత్తగూడెం : తాజా లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో రెండు దశల పోలింగ్ ముగిసింది. చాలా పార్లమెంట్ నియోజకవర్గాల్లో మునుపటి (2019) ఎన్నికల కంటే తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. ఖమ్మం పార్లమెంట్ స్థానంలోనూ 2019 ఎన్నికల్లో నాలుగో వంతు మంది ఓటుకు దూరంగా ఉన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాలతో పోల్చిచూస్తే ఖమ్మం నగరంలోనే తక్కువ పోలింగ్ (73.14%) నమోదైంది. 'నేకొక్కడినే ఓటేయకుంటే ఏమవుతుంది?' అనే ఉదాసీనతలోంచి బయటపడేసి.. ఓటర్లంతా స్వయం ప్రేరణతో కేంద్రాలకు తరలివచ్చేలా ఎన్నికల యంత్రాంగం చైతన్యం కల్పించాలి. రాజకీయ పార్టీలు సైతం సహకరించాలి.

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, సులభతరంగా ఓటు వినియోగించుకోవడమే లక్ష్యమని ఉమ్మడి జిల్లాల ఎన్నికల యంత్రాంగం చెబుతోంది. కానీ, మెరుగైన ఓటింగ్ నమోదుకు అనుసరించే పద్ధతులు తేలిపోతున్నాయి. వసతుల కల్పన, ఓటరు చైతన్యానికి అనుసరిస్తున్న 'అందరికీ ఒకే పద్ధతి' వ్యూహం సత్ఫలితాలివ్వడం లేదు. నగరాలు, పట్టణం, పల్లెలు, గిరిజన గూడేలకు వేర్వేరు వ్యూహాలు అనుసరించాలి. ఓటరు సంఖ్యకు తగ్గట్టు పోలింగ్ కేంద్రాల పెంపు, దూరప్రాంతాలకు ప్రజా రవాణాపై దృష్టిపెట్టాలి. దీనికి బూత్‌ల వారీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి. వేసవి ఎండల దృష్ట్యా కేంద్రాల్లో రద్దీ నిర్వహణకు చర్యలు చేపట్టాలి. చీమల్లాంటి బారులను చూసి ఓటేసేందుకు రానివారే ఎక్కువని గత ఎన్నికల్లో రుజువైంది. పోలింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగేలా సిబ్బందిని అప్రమత్తం చేయడం, రద్దీ నియంత్రణలో ఉండేలా చూడటం, షామియానాలు, తాగునీరు, ఓఆర్ఎస్, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించడం ముఖ్యం. పట్టణాల్లో షెల్టర్లు, పార్కింగ్ వంటివి ఏర్పాటు చేయాలి. 85 ఏళ్లుదాటిన వృద్ధులు, నలభై శాతం వికలత్వం గల దివ్యాంగులందరూ ఇళ్ల వద్ద వంద శాతం ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి. గత అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటేసే యువత, మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కేంద్రాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వీటి సంఖ్య పెంచి వంద శాతం పోలింగ్ లక్ష్యంగా ప్రోత్సహించాలి. స్థానిక నేపథ్యంతోనూ కేంద్రాలను తీర్చిదిద్ది ఓటర్లను రప్పించవచ్చు.

వేలి సిరా చుక్క చూపుతూ దిగిన చిత్రాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు పలు రాష్ట్రాల్లో యువ ఓటర్లు ఉత్సాహం చూపారు. ఇలా అన్నివర్గాల ఓటర్లను ఆకర్షించేలా ఉమ్మడి జిల్లాల ఎన్నికల యంత్రాంగం, 'స్వీప్' విభాగం ప్రత్యేక చొరవచూపాలి. నాలుగో దశలో (మే 13న) పోలింగ్ జరిగే నేపథ్యంలో 5కె రన్, వాకథాన్, మారథాన్ వంటి కార్యక్రమాలను ముందే నిర్వహించి ఉత్సాహం నింపాలి.రెండో దశ లో భాగంగా కేరళలో ఓ పోలింగ్ కేంద్రాన్ని 'అడవి థీమ్'తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఓటేసిన వారికి ఉచిత టిఫిన్, రాయితీలు కల్పిస్తూ 'బృహత్ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్' చేసిన ప్రయత్నాన్ని ఖమ్మం, కొత్తగూడెం వంటి పట్టణాల్లో అనుసరించొచ్చు.

# కొత్త పంథాలో రాజకీయ దావత్‌లు!



హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో తలమునకలవుతున్నాయి. ఆయా పార్టీల నేతలు, అభ్యర్థులు ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్రనేతలతో కార్నర్ మీటింగ్‌లు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాడర్, కార్యకర్తలను సమావేశపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దావత్‌ల నిర్వహణ జోరుగా సాగుతోంది. ఇందుకు శివార్లలోని ఫంక్షన్‌హాళ్లు, ఫాంహౌస్‌లు కేంద్రంగా మారుతున్నాయి. పార్టీ కార్యక్రమంలా కాకుండా శుభ కార్యక్రమంలా ఏర్పాట్లు చేసి మందు, విందులతో క్యాడర్, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. రానున్న 15 రోజులు కీలకం కావడంతో ఇలాంటి దావత్ సమావేశాలు మరిన్ని ఎక్కువగా నిర్వహించేందుకు ప్రధాన పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు.

ఎన్నికల ఖర్చు కారణమే

ఎన్నికల సంఘం నిఘా నుంచి తప్పించుకోవడానికి ఇలాంటి దావత్‌లు కీలకం అవుతున్నాయి. నిబంధనల ప్రకారం అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.70లక్షలు, ఎంపీ అభ్యర్థికి రూ.90 లక్షల వరకు పరిమితి ఉంది. అట్టహాసంగా ప్రచారాలు, ఎక్కడ పడితే అక్కడ సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఆ ఖర్చు అభ్యర్థి ఖాతాలో పడుతుంది. ఇటీవలి నామినేషన్ కోసం అట్టహాసంగా వెళ్లిన ఓ నేత ఖాతాలో ఒకేరోజు రూ.10లక్షల ఖర్చు పడింది. 20రోజుల ముందే తన వ్యక్తిగత ఖాతాలో రూ.10లక్షల ఖర్చు పడితే..మున్ముందు ప్రచారాన్ని నిర్వహించడం కష్టం కానుండటంతో అభ్యర్థులు అప్రమత్తమవుతున్నారు. ప్రచారం నిర్వహిస్తూ ఖర్చు తమ ఖాతాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో వేరే వ్యక్తుల పేర్లతో ఫంక్షన్ హాళ్లు అద్దెకు తీసుకొని శుభకార్యాన్ని నిర్వహించినట్లు ఖర్చు నుంచి తప్పించుకోవడానికి ఎత్తుగడలు వేస్తున్నారు. పేరుకే దావత్ అన్నట్లు చూపుతూ తమ లక్ష్యాన్ని నెరవేర్చుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు నువ్వా..?నేనా..? అన్నట్లు ఉన్న నియోజకవర్గాల్లో ఈ తరహా పార్టీలు జోరుగా సాగుతున్నాయి. అసంతృప్తితో ఉన్న నాయకులను బుజ్జగించడం ద్వారా తిరిగి తమ వైపు తిప్పుకోవడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

శుభకార్యాలకు హాజరు..

ఎన్నికల తరుణంలో నగరంలో శుభకార్యాలకు బాగా డిమాండ్ పెరిగింది. కింది స్థాయి కార్యకర్తలు, నాయకుల ఇళ్లలో జరిగే పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలకు పిలిచిందే తడువుగా నేతలు హాజరవుతున్నారు. అక్కడకు వచ్చిన అతిథులతో ముచ్చట్లు పెడుతూ తమకే ఓటు వేయాలని కోరుతున్నారు. ఈ కార్యాలకు వచ్చే ఇతర పార్టీల నేతలతో పలకరిస్తూ ఆయా పార్టీల కార్యకర్తలకు గేలం వేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తమ ఇంట్లో శుభ కార్యాలకు పిలిచినారాని నేతలు ఓట్ల పండగ ముందుండటంతో వారే చొరవ తీసుకొని వస్తుండటం కార్యకర్తలు, ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అంతా ఎన్నికల మహిమ అనుకుంటున్నారు.

# బడుల బాగుకు నిధులు

చేగుంట: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. జిల్లాలో చాలా పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు లేకపోవడంతో ఎలాంటి పనులు చేయలేకపోతున్నారు. 'మన ఊరు..మన బడి' కింద గతంలో చాలా పాఠశాలలను ఎంపిక చేశారు. కానీ చాలా చోట్ల పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసింది. వాటిద్వారా ఎంపిక చేసిన పాఠశాలలను అభివృద్ధి చేయనున్నారు.

చేపట్టే పనులు: ముఖ్యంగా శౌచాలయాలు, తాగునీరు, విద్యుత్తు, తరగతి గదుల మరమ్మతులు చేపట్టనున్నారు. మొదటి విడతగా మౌలిక వసతుల కల్పన, ఏకరూప దుస్తుల కుట్టుకూలీ కోసం 25శాతం నిధులు మంజూరు చేశారు. పాఠశాలల్లో గరిష్ఠంగా రూ.14 లక్షలు, కనిష్ఠంగా రూ.1.35 లక్షలతో పనులు గుర్తించారు. వీటిని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల తీర్మానం మేరకు పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి పనులు అవసరమో పరిశీలించారు.

నిబంధనల మేరకే నిధులు డ్రా

వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి మౌలిక వసతుల పనులు పూర్తిచేయాల్సి ఉంటుంది. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. రూ.25 వేల విలువైన పనులు చేపట్టిన అనంతరం అమ్మ ఆదర్శ కమిటీలు సమావేశమై నిధులను బ్యాంకు నుంచి డ్రా



చేయాల్సి ఉంటుంది. రూ.లక్ష వరకు అయితే ఎంపీడీవో అనుమతి తీసుకోవాలి. రూ.లక్ష పైబడి విలువైన పనులను చేపడితే జిల్లా మహిళా సమాఖ్యతో పాటు, ఉన్నతాధికారి అనుమతితో నిధులు డ్రా చేయాల్సి ఉంటుంది.

మొదటి విడతలో రూ.5 కోట్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20.62 కోట్లను మంజూరు చేసింది. మొదటి విడతగా 25శాతం కింద రూ.5 కోట్లు విడుదల చేశారు. ఈ పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టనున్నారు. జిల్లాలో మన ఊరు..మన బడి కింద మొదటి విడతలో 313 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో కొన్ని పనులు చేపట్టారు. పాఠశాలల భవనాలు, భోజనశాలలు వంటివి నిర్మాణం చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశారు. తర్వాత మౌలిక వసతులు లేని 562 పాఠశాలలను గుర్తించి పనులు చేపట్టనున్నారు.

పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి: రాధాకిషన్, డీఈవో

పాఠశాలల్లో అవసరమైన పనులను చేపట్టి వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిచేయాల్సి ఉంది. త్వరలోనే జిల్లాలో అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించనున్నారు. ఈ పనులు పూర్తయితే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# కార్మికులకు కలిసొచ్చే కాలమే..!

నాంపల్లి : 'మూఢం' వచ్చేసింది.. పెళ్లిళ్లు, పేరంటాళ్లు, శుభకార్యాలకు అంతరాయం ఏర్పడింది. గ్రహాల స్థితి సరిగా లేని సమయాన్ని 'మూఢం'గా పండితులు పరిగణిస్తారు. గురుగ్రహం సూర్యుడికి దగ్గరగా వచ్చినపుడు గురుమౌఢ్యంగా, శుక్రగ్రహం సూర్యగ్రహానికి దగ్గరగా వచ్చినపుడు శుక్ర మౌఢ్యంగా పిలుస్తారు. ఈ కాలాన్ని ఏవైనా పనులు ప్రారంభించడానికి అశుభంగా భావిస్తూ వాయిదా వేస్తుంటారు. ఏప్రిల్ నెల 27 నుంచి ఆగస్టు 8 వరకు 'మూఢం' ఉంటుందని పండితులు చెబుతున్నారు. కానీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లోక్‌సభ ఎన్నిక ఇదే సమయంలో వచ్చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా అరంగేట్రం చేసి రాజకీయ భవిష్యత్తు పరీక్షించుకునే యువ నాయకులు, గత రాజకీయ భవిష్యత్తును గణనీయంగా కోల్పోయిన అగ్రజులు, పాత పార్టీలో ఇమడలేక పార్టీలు మార్చే నేతలకు ఈ కాలం కలిసొచ్చేనా అనే సందేహాలు వేధిస్తున్నాయి.



శుభకార్యాలకు విరామం.. ప్రచారం ఆరంభం

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశావహ నేతలందరూ ఓట్ల కోసం తమ అభిమానులు, అనుచరులకు సంబంధించి అన్ని శుభకార్యాలకూ హాజరవుతూ వస్తున్నారు. ప్రస్తుతం 'మూఢం' రావడంతో వాటికి బ్రేక్ పడింది. ఇక మిగిలిందల్లా ఎన్నికల ప్రచారం, ఊరేగింపులు, ర్యాలీలు, బహిరంగ సభలు, తదితర జనసమ్మర్ధ కార్యక్రమాల్లోనే ఓటర్లను మూకుమ్మడిగా ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఓటరు మహాశయులను కలవాలంటే శుభకార్యాలకు బదులుగా పుట్టినరోజు వేడుకలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకునే ఆత్మీయ సమ్మేళనాలవంటి సందర్భాలు సృష్టించుకోవాల్సిందే.

మే 13న లోక్‌సభ ఎన్నికలు, ఆ వెంటనే గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు ఎన్నికలు జరగనుండటంతో శుభకార్యాలకు అడ్డొచ్చిన 'మూఢం' కాస్తా.. కష్టం చేసుకునే కార్మికులకు కలిసొచ్చేలా ఉంది. శుభకార్యాలకు పనిచేసే వృత్తుల వారికి ఈ ఎన్నికలతో ఉపశమనం లభించనుంది. ముఖ్యంగా వివిధ పార్టీల ప్రచారం కోసం, టిఫిన్లు, భోజనాల తయారుతో పాటు విజయోత్సవాల నిర్వహణ వంటి కార్యక్రమాలకు ఎంతో మంది కూలీల అవసరం ఉంటుంది. నాయకుడు ఊరేగింపులో మేళతాళాలు వాయించే వారి నుంచి డీజే, లైటింగ్, జెండాలు పట్టే వారు, నృత్యాలు, కోలాటాలు, బ్యానర్లు కట్టే వారు, జెండాలు మోసే వారు, వంటా వార్పు, వడ్డింపులు, కూలీలు ఇలా అన్ని రంగాల్లో పని చేసే కార్మికులకు పని చూపదనుకున్న ఈ 'మూఢం' కాస్త ఎన్నికల పుణ్యమాని ఊరటనివ్వనుంది.

# ఆ 60వేల ఓట్లు ఎవరివి?.. పాతబస్తీలో ఆచూకీ దొరకని ఓటర్లు



హైదరాబాద్: గతంలో ఎప్పుడూ లేని విధంగా.. పాతబస్తీలో ఆచూకీ లేని 60వేల మంది ఓటర్లను జీహెచ్ఎంసీ గుర్తించింది. మరిన్ని గుర్తింపు కార్డులను పరిశీలించాల్సి ఉండగా ఎన్నికల తేదీ దగ్గరపడటంతో అధికారులు పరిశీలన కార్యక్రమాన్ని ఆపేసినట్లు సమాచారం. ఆచూకీ లేని ఓటర్ల వివరాలను ఇప్పటికప్పుడు రద్దు చేయడం కుదరదని, నిబంధనలను అనుసరించి ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలో చేర్చి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పంపించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

గుర్తింపు కార్డుతో వస్తేనే.. హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో 22 లక్షల మంది ఓటర్లున్నారు. అందులో 6,72,404 బోగస్ ఓట్లు ఉన్నాయని గతంలో కాంగ్రెస్ నేత ఈసీకి ఫిర్యాదు చేశారు. అందులో నకిలీ చిరునామాలతో 2,88,956, ఇతరత్రా 1,74,990, చనిపోయిన ఓటర్లు 15,025, ఒకే ఇంటి నంబరు మీద 50కి మించి గుర్తింపుకార్డులున్న ఇళ్లలోని ఓటర్లు 53,991, నకిలీ ఇంటి నంబర్లలోని ఓటర్లు 23,045 మంది ఉన్నారని గుర్తింపుకార్డులనూ అధికారులకు అందజేశారు. దీనిపై బల్దియా విచారణ చేపట్టింది. చనిపోయినట్లు, చిరునామాలో లేకపోవడం, విచారణకు వెళ్లినప్పుడు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో.. అనుమానం ఉన్న 60వేల ఓట్లను ఏఎస్‌డీ జాబితాలో చేర్చామని.. వివరాలు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉంచుతామని తెలిపారు. నిజమైన ఓటర్లు గుర్తింపుకార్డులతో పోలింగ్ కేంద్రానికి వస్తే ఓటు వేసేందుకు అనుమతి ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం ఆచూకీ లేనివి రద్దవుతాయన్నారు.

రెండేళ్లలో 6.6 లక్షలు తొలగింపు

ఫిబ్రవరి 8, 2024న జారీ అయిన ఓటరు తుది జాబితా ప్రకారం.. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో కలిపి 45,70,138 మంది ఓటర్లున్నారు. అప్పట్నుంచి ఇప్పటివరకు వరకు మరో 1.4 లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అధికారులు ఆమోదించారు. అదే సమయంలో 1.2 లక్షల ఓట్లను రద్దు చేశారు. దీంతో హైదరాబాద్ జిల్లా ఓటర్లు 20 వేలు పెరిగి 45,90,138 లక్షలకు చేరుకున్నారు. గడిచిన రెండేళ్లలో హైదరాబాద్ జిల్లాలో రద్దయిన 5.4 లక్షల ఓటర్లను, తాజాగా రద్దయిన 1.2 లక్షల ఓట్లను కలిపితే మొత్తం 6.6 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించినట్లు తెలుస్తోంది.




## ‘400 మంది మహిళలపై ప్రజ్వల్ అఘాయిత్యం’ - రాహుల్ సంచలన ఆరోపణ

శివమొగ్గ: మాజీ ప్రధాని దేవేగౌడ మనవడు, హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దాదాపు 400 మంది మహిళలపై ప్రజ్వల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని, వారి వీడియోలు చిత్రీకరించాడని అన్నారు. అటువంటి వ్యక్తికి ఓట్లు వేయాలని కోరిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శివమొగ్గలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన ప్రజ్వల్‌ను మాస్ రేపిస్ట్‌గా పేర్కొన్నారు. ‘ప్రజ్వల్ రేవణ్ణ 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడి, వారి వీడియోలు చిత్రీకరించాడు. ఇది సెక్స్ కుంభకోణం కాదు. ఇది అతిపెద్ద అత్యాచార ఘటన. ఓట్ల గురించి వాళ్లు (భాజపా కూటమి) అడుగుతున్నప్పుడు ప్రజ్వల్ ఏం చేశాడో ప్రతీ మహిళ తెలుసుకోవాలి. అతడి గురించి ప్రధానికి ముందే తెలుసు. అటువంటి వ్యక్తికి కర్ణాటక వేదికగా మోదీ మద్దతు పలికారు’ అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజ్వల్ ఒక మాస్ రేపిస్ట్ అని భాజపాకు చెందిన ప్రతీఒక్క నేతకు తెలుసునని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయినప్పటికీ అతడికి మద్దతు పలకడమే కాకుండా అతడి పార్టీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. అటువంటి వ్యక్తికి ప్రచారం చేసినందుకు గాను దేశంలో ప్రతీ మహిళకు ప్రధాని మోదీ, అమిత్ షా సహా భాజపా నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, ఎమ్మెల్యే రేవణ్ణపై లైంగిక దౌర్జన్యం అభియోగాలపై కేసు నమోదైంది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసింది. కేసు విచారణకు హాజరుకావాలని వీరిద్దరికీ సిట్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. వారం రోజుల సమయం కావాలని ప్రజ్వల్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన దర్యాప్తు బృందం.. ఆయనపై తాజాగా లుక్‌అవుట్ నోటీసు జారీ చేసింది.




గాంధీనగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పాకిస్థాన్ మాజీ మంత్రి ప్రశంసలు కురిపించడం చర్చనీయాంశమైంది. దీనిపై భాజపా నేతలు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ.. హస్తం పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ యువరాజు కోసం పాక్ నేతలు ప్రార్థిస్తున్నారని ఆరోపించారు. వారి మధ్య బంధం తేటతెల్లమైందని అన్నారు. గుజరాత్‌లోని ఆనంద్ ప్రాంతంలో మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై పాక్ ప్రశంసల అంశాన్ని ప్రస్తావించారు. “దేశంలో కాంగ్రెస్ నానాటికీ బలహీనపడుతోంది. ఇక్కడ ఆ పార్టీ అస్థిత్వాన్ని కోల్పోతుంటే.. అక్కడ పాకిస్థాన్ కన్నీళ్లు పెట్టుకుంటోంది. కాంగ్రెస్ యువరాజును (రాహుల్‌ను ఉద్దేశిస్తూ) భారత ప్రధానిని చేయాలని దాయాది తహతహలాడుతోంది. ఆ పార్టీ పాక్‌కు అభిమాని అని మనకు తెలుసు. ఇప్పుడు వారి మధ్య భాగస్వామ్యం పూర్తిగా బయటపడింది” అని మోదీ దుయ్యబట్టారు. “భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని మన శత్రువులు కోరుకుంటున్నారు. 26/11 ముంబయి దాడుల నాటి ప్రభుత్వం, 2014కు ముందున్న సర్కారు మళ్లీ అధికారంలోకి రావాలని ఆశపడుతున్నారు. అందుకే కాంగ్రెస్ కోసం పాక్ నేతలు ప్రార్థిస్తున్నారు” అని మోదీ మండిపడ్డారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఫవాద్ హుస్సేన్ ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో రాహుల్ గురించి ఓ పోస్ట్ పెట్టారు.

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత ప్రసంగించిన వీడియోను షేర్ చేసి.. ‘రాహుల్ ఆన్ ఫైర్’ అని రాసుకొచ్చారు. దీనిపై భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. “పాక్ మాజీ ప్రధాని రాహుల్‌ను ప్రమోట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆ దేశంలో పోటీ చేయాలనుకుంటోందా? మేనిఫెస్టో దగ్గర నుంచి ఈ ప్రశంసల వరకు హస్తానికి దాయాదితో ఉన్న స్నేహం మరింత స్పష్టమైంది” అని భాజపా ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ విమర్శించారు.

## ఫోన్ ట్యాపింగ్.. నాతో పాటు రేవంత్, హరీశ్‌రావు బాధితులే: బండి సంజయ్



హైదరాబాద్: సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్‌ట్యాపింగ్‌పై అరెస్టులు, రిమాండ్‌లు అన్నీ జరిగాయని తెలిపారు. తీవ్రమైన ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ఇందులో కరీంనగర్ మంత్రి హస్తం ఉందన్నారు. “అనేక ఆరోపణలపై సిట్‌లు వేయడం.. మూసివేయడం సాధారణంగా మారింది. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం. పెద్దల ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు రాధాకిషన్‌రావు చెప్పారు. ఇందులో నేను, రేవంత్‌రెడ్డి కూడా బాధితులమే. ఇదంతా అసెంబ్లీ ఎన్నికల నుంచి జరుగుతోంది. నా కుటుంబ సభ్యులు, సిబ్బంది ఫోన్లనూ ట్యాప్ చేశారు. ఇందులో హరీశ్‌రావు కూడా బాధితుడే. 317జీవో, టీఎస్‌పీఎస్సీ సమయంలో నన్ను అరెస్టు చేయడానికి కారణం ఫోన్ ట్యాపింగ్. దీంతో కేసీఆర్, కేటీఆర్‌కు సంబంధం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రజల ముందు వాస్తవాలను పెట్టడం లేదు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే దీనిపై విచారణ జరిపించాలి. ఈ కేసును సీబీఐకి ఇవ్వాలి. సీబీఐకి ఇవ్వకపోతే ఈ కుంభకోణంతో హస్తం పార్టీకి సంబంధం ఉన్నట్లే” అని బండి సంజయ్ అన్నారు.




హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జ్ మన్నే సతీష్ తో పాటు నవీన్, తస్లీమాను అరెస్ట్ చేశారు. బీజేపీ నేత ప్రేమేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీ పోలీసుల నోటీసుల కంటే ముందే హైదరాబాదులో కేసు నమోదైంది. కాసేపటి క్రితం (గురువారం) ముగ్గురిని అరెస్ట్ చేసి హైదరాబాద్ సీపీఎస్‌కు తరలించారు. కాగా రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో ‘డీప్‌ఫేక్’ వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. డీప్‌ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఈసీ స్పందించలేదన్నారు. ఎన్నికల వేళ చక్కర్లు కొడుతున్న డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ సక్రమంగా ఉంటే గురువారం విచారణ చేపడతామని తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో భాగంగా సీఎం రేవంత్‌కు సమన్లు జారీ అయ్యాయి. అయితే ఈ నోటీసులపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. “బీజేపీపై పోరాటం చేసే వారికి అమిత్ షా నోటీసులు ఇస్తున్నారు. సోషల్ మీడియాలో బీజేపీని ప్రశ్నించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రినైనా నాకు, గాంధీ భవన్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇస్తున్నారు” అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా మోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపిస్తున్నారని చెప్పారు. కాగా.. ఈ కేసులో మే 1న హాజరుకావాల్సిందిగా ఢిల్లీ పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తున్నారని అమిత్ షా పేరుతో ఓ ఫేక్ వీడియోను కాంగ్రెస్ పార్టీ వైరల్ చేసింది. ఫేక్ వీడియోపై కేంద్ర హోం శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 153/153%ూ/465/469/171+% కింద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## మీ ఎమ్మెల్యే కేసీఆర్‌ను టీవీలో చూసి సంతోషపడాల్సిందే తప్ప..




సిద్దిపేట, మే 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఏకిపారేస్తున్నారు. గురువారం కుక్నూర్ పల్లి మండల కేంద్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రఘునందన్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితతో పాటు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కూలీలకు ఉపాధి హామీ పథకం కింద 157 రూపాయలు ఇస్తే మోదీ ప్రభుత్వం వచ్చాక 300 రూపాయలు ఉపాధి హామికింద డబ్బులు పెంచడం జరిగిందన్నారు. “మీ ఎమ్మెల్యే కేసీఆర్‌ను మీరు టీవీలో చూసి సంతోషపడాలి తప్ప ఇంతవరకు ఆయన మీ దగ్గరకు రాలేదు. బతుకమ్మ ఆడితే పైసలు వస్తలేవని చెల్లె ఢిల్లీ పోయి సారా దుకాణం దందా మొదలుపెట్టింది” అంటూ కవితపై సెటైర్ విసిరారు. రేవంత్ రెడ్డిని నమ్మి గెలిపించుకుంటే 4వేల పెన్షన్ ఇంతవరకు రాలేదని విమర్శించారు. చెయ్యి గుర్తుకు ఓటు వేస్తే తల మీద మొండి చెయ్యి పెట్టారు కానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. సూటుకేసుల ఆశతో వెంకట్రామిరెడ్డి వెంట హరీష్ రావు తిరుగుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. 10 సంవత్సరాల మోదీ పాలనలో దేశం చల్లగా ఉందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బాంబుల వర్షం కురుస్తదని ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు వ్యాఖ్యలు చేశారు.

## లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితకు నిరాశ




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా గురువారం ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. నేడు (గురువారం) జైలా లేదా బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కానీ కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది. మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని, అరెస్ట్ నుంచి విచారణ వరకు కవితకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని వాదనలు కవిత తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నందున ఎన్నికల్లో ప్రచారం కోసం బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని, కవిత అరెస్టుకు సరైన కారణాలు లేవని, మహిళగా ఆరోగ్యపరమైన కారణాలు పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు లాయర్లు వాదించారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలు కవితకు తెలుసునని, ఇతరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్, ఆధారాలపై ఆమెను విచారించినా నిజాలు చెప్పడం లేదని కోర్టుకు సీబీఐ న్యాయవాదులు తెలిపారు. హై పొలిటికల్ పవర్ ఉన్న కవిత ఈ కేసు దర్యాప్తును ఆధారాలు సాక్ష్యాలను ప్రభావితం చేయగలరని బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది.

## బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యం కావాలి: కోదండరాం



మెదక్, మే 1: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అనేక ఉపద్రవాలు వస్తాయని, ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ప్రజల ఏకైక లక్ష్యం కావాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. మెదక్‌లో ప్రజాసంఘాలతో కలిసి ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్ధతులపై కోదండరాం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసలు ఎన్నికల అభ్యర్థి ఎవరనేది కూడా పట్టించుకోలేని స్థితికి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు చేరుకున్నాయని, బీజేపీని ఎదురిస్తున్న పార్టీకి అభ్యర్థితో సంబంధం లేకుండా ప్రజలు ఓటేయాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆగ్రహానికి కేసీఆర్ తలొగ్గక తప్పలేదని, రాజ్యాంగ పరిరక్షణకు ఈ ఎన్నికల్లో బీజేపీని కూడా ఓడిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసంఘాలతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు పంపించడంలో కేంద్రం అణిచివేత ధోరణి కనిపిస్తోందన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

## బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుంది : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట : మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మోతెలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా కలిసి మెలిసి ఉంటున్న భారతీయుల మధ్య బీజేపీ చిచ్చు పెడుతున్నది. మతవిద్వేషాలు రెచ్చగొడుతూ ఆ పార్టీ అధికారంలోకి రావాలని చూస్తున్నది. మరోసారి అవకాశం ఇస్తే దేశాన్నే అమ్ముకుంటారని విమర్శించారు. రిజర్వేషన్ల పరిరక్షణ, అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్‌ను గెలిపిం చాలన్నారు. ఆయన వెంట నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల వేళ హైదరాబాద్‌లో భారీగా మద్యం పట్టివేత.. ఏయే ప్రాంతాల్లో అంటే?

హైదరాబాద్, మే 2: ఎన్నికల వేళ నగరంలో భారీగా మద్యం పట్టుబడింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరాకు చెక్ పెట్టేందుకు పోలీసులు అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తరలిస్తున్న మద్యం పోలీసులకు చిక్కింది. తాజాగా దాదాపు నాలుగు వేల లీటర్ల మద్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. సైబరాబాద్ సీపీ నిర్దిష్టమైన సూచనల మేరకు సైబరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఎస్‌వోటీ పోలీసులు, వివిధ పోలీసు స్టేషన్ల సిబందితో కలిసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో నిబంధనలు అతిక్రమించి రవాణా అవుతున్న 37 లక్షల విలువగల నాలుగువేల లీటర్స్ మద్యం పోలీసులకు చిక్కింది. మొత్తం మూడు ప్రాంతాల్లో మద్యంతో పాటు నగదును పోలీసులు పట్టుకున్నారు.

**పట్టుబడిన మద్యం వివరాలు..**బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న రూ.21,53,470 విలువగల 2597.88 లీటర్ల మద్యం పట్టుబడింది. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పేట్ బషీరాబాద్ పీఎస్ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న రూ.15,46,340 విలువగల 1916.2 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్‌వోటీ బాలానగర్ టీం, కేపీహెచ్‌బీ పోలీసులు రేడియంట్ మనీ లాజిస్టిక్ వాహనంలో నిబంధనలు అతిక్రమించి ఎటువంటి క్యూఆర్ కోడ్ లేకుండా తరలిస్తున్న రూ.1,24,626 నగదును పోలీసులు పట్టుకున్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660